– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే పాత శ్రీకాకుళం

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం విధానంలో భాగంగా దుకాణాల కేటాయింపు ప్రక్రియ జిల్లాలో సోమవారం ప్రశాంతంగా జరిగింది. దరఖాస్తుదారులు ఉత్కంఠంగా ఎదురుచూసిన లాటరీ ప్రక్రియను శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం 3:15 గంటలకు వరకు కొనసాగింది. లాటరీ పలికిన వారు ఆనందంలో మునిగి తేలగా రాని వారు నిరాశకు గురయ్యారు.



దరఖాస్తుదారులతో కిక్కిరిసిన అంబేడ్కర్ ఆడిటోరియం

లక్కు.. కిక్కు..!

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు

జిల్లాలో 12 సర్కిళ్ల పరిధిలో 158 మద్యం దుకాణాలకు 4,671 దరఖాస్తులొచ్చాయి. లాటరీ విధానంలో వీటి నిర్వాహకులను ఎంపిక చేశారు. తొలుత జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఉదయం ఎనిమిది గంటలకు లాటరీ తీసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష ప్రక్రియలో భాగస్వాములయ్యారు. ఆశావహులు, వ్యాపారులకు ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేశారు. ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

158 మందిలో రెండేసి లైసెన్సులు 12 మంది దక్కించుకున్నారు.

4,513 మందికి నిరాశే..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,671 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 158 మందిని మాత్రమే అదృష్టం వరించింది. మిగిలిన 4,513 మంది తమ డిపాజిట్లు కోల్పోవాల్సి వచ్చింది. ఇష్టదైవాన్ని కొలిచి ఉదయాన్నే ఆశావహులంతా ఆడిటోరియానికి చేరుకున్నారు. కొందరు సిండికేట్‌గా మారి వందల్లో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఫలితం దక్కలేదు. దీంతో చాలామంది నిరాశ, ఆవేదనతో బయటకొచ్చారు.

ఇదీ తీరు..

- శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ వైకాపా నేత నేతృత్వంలో స్నేహితులు సిండికేట్‌గా ఏర్పడి 140 దరఖాస్తులు చేయగా వారికి ఆరు దుకాణాలు దక్కాయి. వీటిలో శ్రీకాకుళంలో ఐదు, సరుబుజ్జిలి ఒకటి చొప్పున ఉన్నాయి.
- జి.సిగడాం మండలంలో కొందరు గ్రూపుగా ఏర్పడి 101 దరఖాస్తులు చేసుకోగా మూడు పలికాయి.
- రణస్థలం పరిధిలో ఒక వ్యాపార బృందం 80 చోట్ల పెడితే ఒక్కటే వచ్చింది.
- సోంపేటకు చెందిన వ్యక్తి 45 దరఖాస్తులు చేయగా ఒకే దుకాణం వరించింది.
- ఎచ్చెర్ల వ్యక్తి 30 చోట్ల వేస్తే కేవలం ఒక్కటి మాత్రమే పలికింది.
- నరసన్నపేటకు వ్యక్తి ఒకే దుకాణానికి ఎనిమిది దరఖాస్తులు చేశారు. అది అతనికే దక్కింది.
- విజయనగరానికి చెందిన ఓ మిల్లరు జిల్లాలో 150 దరఖాస్తులు వేశారు. వీటిలో కొన్నింటిని సొంతం చేసుకున్నారు.
- నరసన్నపేట మహిళకు ఏకంగా రెండు దుకాణాలు వరించాయి.



తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వచ్చిన మహిళలు

24 దుకాణాలు మహిళలవే...

అన్ని రంగాల్లో ముందుండే మహిళలు మద్యం వ్యాపారంలోనూ తమదైన పాత్ర పోషించేందుకు ముందుకొచ్చారు. ఈ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో మహిళలు సైతం కనిపించడం చర్చనీయాంశమైంది. గృహిణులు, వృద్ధులు, పెళ్లికాని యువతులు సైతం ఉన్నారు. ఏకంగా 24 దుకాణాలను మహిళలే సొంతం చేసుకున్నారు. వీరిలో ఒకే మహిళ ఏకంగా మూడింటిని సొంతం చేసుకోవడంతో అందరి దృష్టిని ఆకర్షించారు. వ్యాపారులు తమ ఇంటి మహిళ పేరుతో దరఖాస్తు చేస్తే అదృష్టం వరిస్తుందనే భావనతో ఇలా చేశారు.

ఎంపిక సాగిందిలా..



లాటరీ తీస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చిత్రంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

గెజిట్ దుకాణాల వారీగా దరఖాస్తు పేర్లు చదివి వారికి కేటాయించిన టోకెన్ నంబర్లను బహిరంగంగా ప్రదర్శించి వాటిని పరిశీలించుకునేందుకు అవకాశం కల్పించారు. అనంతరం ఖాళీ డబ్బాను చూపించి అందులో టోకెన్లు వేశారు. వాటిని కలియ తిప్పి అందులో నుంచి అధికారులు ఒక టోకెన్ తీసి దుకాణం దక్కిన వ్యక్తి పేరును ప్రకటించారు. అదనంగా రిజర్వు కింద మరో రెండు టోకెన్లు తీసి వారి పేర్లను ఎంపిక చేశారు. మొదటి వ్యక్తి ఏదైనా కారణం చేత దుకాణం తీసుకోకపోతే రిజర్వులో ఉన్నవారు దాన్ని పొందవచ్చు. దుకాణం దక్కిన వ్యక్తి నుంచి ఆరోవంతు నగదు చెల్లించారు. ఇందుకోసం బ్యాంకర్లను అందుబాటులో ఉంచారు.

సిండికేట్ మయం..!

మద్యం దుకాణాలకు అత్యధికం సిండికేట్‌గా సాగిన వ్యక్తులకే దక్కాయి. అన్ని ప్రాంతాల్లోనూ స్నేహితులు, బంధువులు కలిసి పదుల సంఖ్యలో దరఖాస్తులు చేసుకోగా తరతరాలుగా మద్యం వ్యాపారం చేస్తున్న వారు గ్రూపులుగా ఏర్పడి 100-200 వరకు దరఖాస్తులు చేసుకున్నారు. అదృష్టం వరించి ఎక్కడ కేటాయింపు జరిగినా అందరూ కలిసి చేసుకునేలా ప్రణాళికలు వేసుకున్నారు. తొలిసారి మద్యం వ్యాపారం చేసేందుకు అనుభవమున్న వారితో జత కట్టినవారు కనిపించారు.



మదిమదినా సిరుల తల్లి

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు.. పూసపాటి వంశీయుల ఆడబిడ్డ.. విజయనగరం పైడిమాంబ తొలేళ్ల సంబరం సోమవారం కనుల పండువగా సాగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 8 గంటల సమయంలో ఆలయ అనువంశిక ధర్మకర్త, గజపతుల వారసుడు పూసపాటి అశోక్ గజపతిరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వచ్చారు. గర్భగుడిలో తమ ఆడపడుచుకు పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్





అమ్మవారిని ఊయలలో ప్రతిష్ఠించేందుకు తీసుకొస్తున్న పూజారులు

శభాష్ పోలీస్..!

ఈనాడు కథనానికి స్పందన



సామాజిక బాధ్యతలో మేము సైతమని ముందుకొచ్చారు నరసన్నపేట పోలీసులు. పాత జాతీయ రహదారిపై నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఏర్పడిన గొయ్యిని పోలీసు సిబ్బంది హుటాహుటిన పూడ్చారు. రెండు రోజుల కిందట రహదారి మధ్యలో ఐదు అడుగుల లోతున గొయ్యి పడిన విషయం తెలిసిందే. దీనిపై 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన 'ఇది ప్రమాదాన్ని ఆపగలదా?' వార్తకు పోలీసు యంత్రాంగం స్పందించింది. ఎస్సై దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు హెచ్‌సీ వై.దాలినాయుడు, కానిస్టేబుల్ పి.మాధవరావు యుద్ధప్రాతిపదికన గ్రావెల్‌తో గొయ్యి పూడ్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట



ప్రధాన రహదారిపై పడిన గొయ్యి పూడ్చుతున్న పోలీసులు

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట

పరీక్షలు నిర్వహించారు.. పరికరాలు మరిచారు!

- ఆరు నెలలుగా విభిన్న ప్రతిభావంతుల ఎదురుచూపులు

మాది సరుబుజ్జిలి మండలం రొట్టవలస. మా అబ్బాయి దివ్యాంగుడు. ఈ ఏడాది మార్చిలో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎల్ఎన్‌పేటలో సరుబుజ్జిలి, బూర్జ, ఎల్ఎన్‌పేట, కొత్తూరు, హిరమండలాల్లోని విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాల నిర్ధారణకు కార్యక్రమం నిర్వహించారు. మా కుమారుడికి మూడు చక్రాల సైకిల్ అవసరమని వైద్యులు సూచించారు. ఆరు నెలలు గడిచినా అందజేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాడు.
– ఓ విభిన్న ప్రతిభావంతుడి తండ్రి ఆవేదన

- ఎల్ఎన్‌పేట మండలం మల్లికార్జునపురానికి చెందిన బాలుడిని వైద్య శిబిరంలో పరీక్షించి వీల్‌ఛైర్ అవసరమని వైద్యులు సిఫార్సు చేశారు. ఆరు నెలలుగా అతనికి ఎదురుచూపులే మిగిలాయి.
- ఎల్ఎన్‌పేట మండలం ధనుకువాడకు చెందిన బాలుడికి రొలేటర్ అవసరమని వైద్యులు సూచించారు. ఇప్పటికీ మంజూరు చేయలేదు.



కంచిలి భవిత కేంద్రంలో పరీక్షకు హాజరైన విభిన్న ప్రతిభావంతులు (పాత చిత్రం)

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు సకాలంలో అందక విభిన్న ప్రతిభావంతులు అవస్థలు పడుతున్నారు. దివ్యాంగ చిన్నారులకు జీవితంపై భరోసా ఇచ్చేందుకు మండల కేంద్రాల్లో భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వారికి బోధించడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించారు. అవయవ లోపాలను గుర్తించి అవసరమైన పరికరాలు అందించేందుకు ఏడాదికి ఒకసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లు, వినికిడి పరికరాలు, వీల్‌ఛైర్లు, చంక కర్రలు, బెల్ట్ ఛైర్స్, ఎంఆర్ కిట్లు, కృత్రిమ అవయవాలు ఉచితంగా అందజేస్తారు.

జిల్లాలో 30 భవిత కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో ప్రతి నియోజకవర్గంలో ఒకచోట ప్రభుత్వ వైద్యులు అవయవ లోపాలను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన పరికరాలు అందించడానికి సిఫార్సు చేశారు. జిల్లాలో 512 మందికి పరీక్షలు నిర్వహించగా 490 మంది పిల్లలకు ప్రత్యేక పరికరాలు అవసరమని గుర్తించారు. ఉచితంగా పరికరాలు వస్తాయని పిల్లల తల్లిదండ్రులు ఆశించారు. పరీక్షలు నిర్వహించి ఆరు నెలలు గడిచినా సరఫరా చేయలేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం.. జిల్లాలోని 30 మండలాల్లో విద్యా శాఖకు అనుబంధంగా ఉన్న భవిత కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ఆయా నియోజకవర్గాల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్హుల జాబితాను ఉన్నతాధికారులకు పంపాం. ప్రభుత్వం పరికరాలు సమకూర్చిన వెంటనే వారికి అందజేస్తాం.
– గోవిందరావు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త, శ్రీకాకుళం

పల్లెకు పండగొచ్చింది



గ్రామీణ ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం తలపెట్టిన 'పల్లె పండగ' కార్యక్రమం అంతటా సందడి వాతావరణంలో సోమవారం ప్రారంభమైంది.. జిల్లా వ్యాప్తంగా మంత్రి, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో పనులకు శంకుస్థాపనలు చేశారు. చాలారోజుల తర్వాత ఇన్ని పనులు ఒకేసారి ప్రారంభం కావడంతో హర్షం వ్యక్తమవుతోంది.. ఇందులో భాగంగా రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి జిల్లా ఆసుపత్రి ప్రాంగణం నుంచి టెక్కలి-తెంబూరు రహదారి, పాతజాతీయ రహదారి నుంచి భవానీనగర్- అయ్యప్పనగర్ మీదుగా బైపాస్ దారి పనులకు శంకుస్థాపన చేశారు.
– న్యూస్‌టుడే, టెక్కలి

రైతేరాజు 6లో



ప్రేమతో వారిద్దరి మనసులు కలిశాయి.. పెళ్లితో ఒక్కటయ్యారు. . జీవితాంతం ఒకరికొకరు తోడుండాలని భావించారు.. కానీ వీరి అన్యోన్యతను చూడలేకపోయిందేమో విధి.. హాయిగా సాగిపోతున్న దంపతుల బంధాన్ని చిదిమేసింది.. రోడ్డు ప్రమాద రూపంలో భర్తను విడదీసింది. . చేదువార్త విన్న ఆమె గుండె పగిలింది.. భర్తలేని లోకంలో నేనుండలేనంటూ తానూ వెళ్లిపోయింది.. ఈ హృదయ విదారక ఘటన లావేరు మండలంలో చోటుచేసుకుంది..

భర్తతో భవాని (పాత చిత్రం)

బతుకైనా.. చావైనా నీతోనే..!

- రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
- తట్టుకోలేక భార్య ఆత్మహత్య

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల(లావేరు)

లావేరు మండలం కేశవరాయనపాలెం గ్రామానికి చెందిన నాయిని చంటి ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురం పంచాయతీ నందిగాంకు చెందిన భవానీ ప్రేమించుకొని ఏడాదిన్నర కిందట మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. చంటి దసరా రోజున ఉదయం అల్పాహారం తీసుకొచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మురపాక సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే.. భర్త మరణవార్త విన్న భవానీ ఆదివారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందింది. ఈ ఘటనతో కేశవరాయనపాలెం గ్రామం విషాదంలో మునిగిపోయింది. భవాని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లావేరు పోలీసులు ఈ ఘటనలపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

మల్లన్నా.. సమస్యలే స్వాగతమా..?

ఆలయంలో నిలిచిన నిర్మాణాలు

కలియుగ కైలాసంగా పేరొందిన రావివలస ఎండల మల్లికార్జునస్వామి శివక్షేత్రం కార్తిక మాసం ప్రారంభం నుంచే భక్తుల కోలాహలంతో రద్దీగా మారుతుంది. ఈ ఆలయాన్ని వైభవంగా తీర్చిదిద్దేందుకు 2014-2019 మధ్య అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చూపిన చొరవ గుడి ప్రాభవాన్ని పెంచింది. ఆ సమయంలో రూ.75 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రాకార మండప నిర్మాణంతో కొత్త శోభ సంతరించుకుంది. ఈ దశలోనే రావివలసలో మెట్‌కోర్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమను నిర్వహణకు తీసుకున్న అభిజిత్ ఫెర్రోటెక్ యాజమాన్యం రూ.కోటి నిధులను మల్లన్న ఆలయ అభివృద్ధి కేటాయిస్తామని ప్రకటించి రూ.60 లక్షల వరకు పనులు చేపట్టింది. పరిశ్రమ మూతపడటంతో అక్కడితో ఆ నిర్మాణాలు ఆగిపోయాయి. ఓవైపు రూ.75 లక్షల నిధులతో చేపట్టాల్సిన పనులు కొన్నిచోట్ల నిలిచిపోయాయి.



రావివలస ఎండల మల్లన్న క్షేత్రం



నిలిచిన నవగ్రహ మండపం నిర్మాణం

వస్తోంది కార్తికం..

జిల్లాతో పాటు ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రావివలసలోని ఎండల మల్లన్న దర్శనానికి భక్తులు తరలివస్తారు. ప్రత్యేకించి ఈ మాసంలో సోమవారాల్లో లక్షలాదిగా వస్తారు. అందుకు తగ్గట్టుగా దేవాదాయశాఖ ఏటా ఏర్పాట్లు చేస్తూ వస్తోంది. అయితే ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్యేకించి ఉచిత దర్శనాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రసాదాల విక్రయాల్లో అధికధరలు వసూలు చేస్తుండటంతో పాటు నాణ్యత పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మధ్యలో ఆగిపోయాయి

- ఆలయంలో ప్రాకార మండపంతో పాటు స్వామివారి శీర్షాభిషేక మండపం వంటి పనులు పూర్తయ్యాయి. ఉపాలయాలు, నవగ్రహ మండపం, కేశఖండనశాల వంటివి మధ్యలో ఆగిపోయాయి.
- ప్రాకార మండపంపై శాలాహారం నిర్మిస్తే ఆలయానికి కొత్తరూపు వస్తుందని అర్చకులు చెబుతున్నారు. వీటిని పూర్తిచేసేందుకు అటు దాతలను సమీకరించడం, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడంపై గానీ త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- భోగశాల, అర్చక విశ్రాంతి గది సైతం ఇక్కడ అందుబాటులో లేవు. సీత పుష్కరిణికి ఒకవైపే మెట్లు ఉన్నాయి. మిగిలిన రెండువైపులా ఎటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- మరుగుదొడ్ల నిర్మాణాన్ని సైతం మధ్యలోనే వదిలేశారు. దేవస్థానం వద్దకు వచ్చే భక్తులకోసం విశ్రాంతి మండపాలు, ఆలయం చుట్టూ రక్షణగోడ నిర్మాణాలు చేపడితే ప్రయోజనకరంగా ఉంటుంది.
- నౌపడ - మెళియాపుట్టి రహదారిలో రావివలస కూడలివద్ద, గ్రామంలో ఆలయానికి వెళ్లే మార్గం కూడలి వద్ద భారీ ముఖద్వారాలు ఉండేవి. అవి గతంలో తుపాన్ల సమయంలో కుప్పకూలాయి.



మెట్లు నిర్మించాల్సిన సీత పుష్కరిణి

నిధుల మేరకు పనులు చేశాం.. రావివలస దేవస్థానంలో దేవాదాయశాఖ నిధులు ఉన్నంతవరకు అభివృద్ధి చేశాం. కొత్తగా మరికొన్ని ప్రతిపాదనలు చేస్తే నిధులు మంజూరైన వెంటనే పనులు జరిపిస్తాం.
– కేవీసీ కృష్ణమూర్తి, డీఈఈ, దేవాదాయశాఖ

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం



ఇచ్ఛాపురంలో అన్న క్యాంటీన్‌ను మంగళవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించనున్నారు. పురపాలక సంఘ కార్యాలయ సమీపంలో గాంధీపార్కు ఆవరణలో దీనిని ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించనున్నారు. రోజూ కనీసం 300 మంది రావొచ్చని అంచనా. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో అప్పారావు

కలెక్టరేట్(శ్రీకాకుళం), శ్రీకాకుళం నేర వార్తావిభాగం, న్యూస్‌టుడే: మీకోసం కార్యక్రమంలో వస్తున్న వినతులను గడువు లోగా పరిష్కరించాలని. అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. వినతులు అపరిష్కృతంగా ఉండటానికి వీల్లేదని పునరుద్ఘాటించారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖ జిల్లా స్థాయి అధికారి పరిశీలించాలన్నారు. 102 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. డీఆర్వో ఎం.అప్పారావు, జిల్లా పరిషత్తు సీఈవో శ్రీధర్‌రాజు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌లో 50 వినతులు అందాయి. వాటిని ఎస్పీ మహేశ్వరరెడ్డి స్వీకరించి బాధితులతో మాట్లాడారు.

అర్ధరాత్రి ప్లాట్‌ఫాంపై ప్రసవం

● తల్లీ బిడ్డను రక్షించిన 108 సిబ్బంది


బిడ్డతో తండ్రి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: కటక్ నుంచి గుణుపురం వెళ్తున్న రైలులో పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణి రైలు దిగి టెక్కలి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఆదివారం రాత్రి బిడ్డకు జన్మనిచ్చింది. అర్ధరాత్రి వేళ దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబాన్ని 108 సిబ్బంది రక్షించి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే లంబుగాం శ్యామల్ అనే మహిళ ఖుర్దా నుంచి పర్లాఖెముండి రైలులో ఆదివారం రాత్రి ప్రయాణిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. నౌపడా జంక్షన్ రైల్వేస్టేషన్ సమీపంలో 108 వాహనానికి సమాచారం అందించి టెక్కలి స్టేషన్‌కు రావాల్సిందిగా కోరారు. వాహనం వచ్చేసరికి ఆమె ప్లాట్‌ఫాంపై ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు ఆరోగ్యంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు.

హెల్ప్ డెస్క్‌కు సమాచారమిస్తే తక్షణ సాయం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్తు కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని ఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సమస్య తలెత్తగానే సంప్రదిస్తే తక్షణ సాయం అందిస్తామని పేర్కొన్నారు.

శ్రీకాకుళం డివిజన్	94906 10045
టెక్కలి	83328 43546
పలాస	73825 85630

విద్యుత్తు సరఫరాలో సమస్య తలెత్తినా.. స్తంభాలు, తీగలు నేలకొరిగినా వినియోగదారులు సంబంధిత డివిజన్ హెల్ప్ డెస్క్‌లను సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం నగరంలోని విద్యుత్తు సర్కిల్ కార్యాలయం హెల్ప్ డెస్క్ నంబరు 94906 12633, ఈపీడీసీఎల్ సెంట్రలైజ్డ్ టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేయాలని సూచించారు.

వైద్య ఆరోగ్య శాఖకు బదలాయించండి


నిరసన తెలుపుతున్న గ్రామ, వార్డు ఆరోగ్య కార్యదర్శులు

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆరోగ్య కార్యదర్శులను పూర్తి అధికారాలతో వైద్య ఆరోగ్య శాఖకు బదలాయించాలని.. సీనియార్టీ జాబితాలు తయారు చేసి ఉద్యోగోన్నతి కల్పించాలని ఏపీ యునైటెడ్ విలేజ్, వార్డు హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శ్రీకాకుళం నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మురళి, ఆరోగ్య కార్యదర్శుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు డి.సాయిప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. జీవో 152 ప్రకారం ప్రసూతి సెలవును ప్రసవ తేదీ నుంచి కాకుండా దరఖాస్తు చేసిన తేదీ నుంచి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య కార్యకర్తలు ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఖజానా శాఖ అభ్యంతరాలతో సరెండర్ లీవ్ పొందలేకపోయారని వాపోయారు. ఏకరూప దుస్తులకు భృతి ఇవ్వాలన్నారు. జీఎన్ఎం శిక్షణ పొందిన హెల్త్ సెక్రటరీలకు జీవో 115 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వినతిపత్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షికి అందజేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి వై.ప్రభావతి, కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్ రాధిక, కోశాధికారి ఎ.రాజ్యం, నాయకులు దమమంతి, లక్ష్మీతులసి, విశాలాక్షి, మోర్సీ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభం నుంచి పరాయి పంచనే

కొత్తూరు మండలంలోని మెట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏడాదిన్నర క్రితం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పాత పంచాయతీ కార్యాలయంలోనే సిబ్బంది సేవలందిస్తున్నారు. ఇరుకు గదితో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రోగులకు సైతం అగచాట్లు తప్పడం లేదు. అధికారులు స్పందించి, ఇబ్బందులను తీర్చాలని పలువురు కోరుతున్నారు. ఈ సమస్యపై పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ.. కొత్త భవనం నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

పొందూరు మండలం తాడివలస ఉన్నత పాఠశాలలో 202 మంది విద్యార్థులు చదువుతున్నారు. నెలకు సుమారు రూ.6 వేల వరకు స్టేషనరీ, ఇతర ఖర్చులు అవుతున్నాయి. రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి సొమ్ము రాకపోవడంతో హెచ్‌ఎం సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు.

జి.సిగడాం ఉన్నత పాఠశాలలో 185 మంది విద్యార్థులు చదువుతున్నారు. నిర్వహణ ఖర్చుల కింద నెలకు సుమారు రూ.5 వేలు హెచ్‌ఎం సొంత నిధుల నుంచి సమకూరుస్తున్నారు.



ఎన్నాళ్లీ నిర్వహణ భారం..?

● ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసిన వైకాపా ప్రభుత్వం
● నిధుల కోసం ప్రధానోపాధ్యాయుల ఎదురుచూపులు

న్యూస్‌టుడే, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు గుదిబండగా మారింది. వైకాపా పాలనలో సరైన ప్రణాళిక లేకపోవడంతో ఖర్చుల భారం వారిపై పడింది. వచ్చింది. గత ప్రభుత్వం రెండు విద్యా సంవత్సరాల్లో పాఠశాల నిర్వహణ గ్రాంట్ మంజూరు చేయలేదు. పిల్లలకు అవసరమైన వనరులు సమకూర్చకపోతే బోధనపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో హెచ్‌ఎంలు సొంత నిధుల నుంచి సర్దుబాటు చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడిచినా బకాయిలు రాకపోవడంతో వారు నిట్టూరుస్తున్నారు. సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చొరవ చూపుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

● పాఠశాలల్లో సుద్దముక్క మొదలుకుని స్టేషనరీ, విద్యుత్తు ఛార్జీలు ఇతర ఖర్చులకు ప్రభుత్వం నిర్వహణ నిధులు మంజూరు చేయాలి. వైకాపా అధికారంలోకి వచ్చాక మూడేళ్లు మాత్రమే సొమ్ము విడుదల చేసింది. ఆ తరువాత నుంచి రాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు సొంత నిధులతో నిర్వహణ సాగిస్తున్నారు. 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి రూపాయి మంజూరు కాలేదు. ఫలితంగా పాఠశాలల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది.

ఇదీ పరిస్థితి

వైకాపా హయాంలో నాడు-నేడు పనులు చేపట్టిన పాఠశాలల్లో విద్యుత్తు బిల్లులు అధికంగా వచ్చాయని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించినా పట్టించుకోని పరిస్థితి నెలకొందని తెలిపారు. సొంత నిధులు వెచ్చించి ఎంత కాలం నిర్వహణ సాగించగలమని ప్రశ్నిస్తున్నారు.

సముదాయ సమావేశాలకూ బకాయిలే



గత రెండేళ్లుగా పాఠశాల నిర్వహణ నిధులు ప్రభుత్వం విడుదల చేయలేదు. సముదాయ సమావేశాలకూ సొమ్ము మంజూరు చేయకపోవడం బాధాకరం. ప్రధానోపాధ్యాయులు సొంత నిధులతో నిర్వహణ సాగిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్తు ఛార్జీలు, స్టేషనరీ తదితర అవసరాలకు బిల్లులు మంజూరు చేయాలి.
– పూజారి హరిప్రసన్న, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు

ఖాతాలకు జమ చేస్తాం..

నిర్వహణ ఖర్చులకు సంబంధించి నిధులు విడుదల కాగానే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమ చేస్తాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్నాం.
– తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

● జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు : 1,954 ● ప్రాథమికోన్నత : 268 ● ఉన్నత : 416 ● విద్యార్థులు : 1,74,015

క్రమబద్ధీకరణ పూర్తి చేయండి



ఎన్నికల ముందు నిలిచిపోయిన క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఒప్పంద అధ్యాపకులు ప్రదర్శన చేపట్టారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈమేరకు ప్రిన్సిపల్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో నరసన్నపేట జూనియర్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆనందరావు, లక్ష్మీనారాయణ, హరిప్రసాద్, రాంప్రసాద్, కృష్ణవేణి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

స్వర్ణాంధ్ర ఆర్థికాభివృద్ధికి పక్కా ప్రణాళిక

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 ఆర్థికాభివృద్ధికి పక్కా ప్రణాళిక ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అధికంగా సూచనలు వచ్చాయని.. వీటికి సంబంధించి జిల్లా, మండల స్థాయి ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. కలెక్టర్లతో సోమవారం దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యాటకం, వ్యవసాయం, ఉద్యాన, పరిశ్రమలు, రవాణా రంగం తదితర ప్రాథమిక రంగాలపై ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రతి జిల్లా 15 శాతం వృద్ధి రేటు సాధించాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మండల స్థాయి నుంచి సమావేశాలు ఏర్పాటు చేశామని.. ప్రజల నుంచి భారీ స్పందన లభించిందని వివరించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో అప్పారావు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

అక్రమ దారిలో పేదల బియ్యం..

● 323 క్వింటాళ్ల సరకు స్వాధీనం


కొత్తూరులో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న లారీ

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు మండలం కర్లెమ్మ బియ్యపు మిల్లు నుంచి ఒడిశాకు తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. జిల్లా విజిలెన్స్ రీజనల్ అధికారి బి.ప్రసాదరావుకు వచ్చిన సమాచారం మేరకు చేపట్టిన దాడిలో నివగాం రహదారిలో 323 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని లారీని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రామారావు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.14.72 లక్షలు ఉంటుందన్నారు. వాహనాన్ని పౌరసరఫరాల శాఖ డీటీ భీమారావుకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మిల్లు యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మిల్లు వద్ద మరికొంత సరకు గుర్తించామన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275


బుడితి వద్ద వేసిన నల్ల బియ్యం పంట

నల్ల బియ్యం.. పోషకాలు ఘనం

తక్కువ పెట్టుబడితో సాగు చేస్తున్న బుడితి రైతు

న్యూస్‌టుడే, జలుమూరు, సారవకోట

తక్కువ పెట్టుబడితో నల్ల వరిని సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుందని నిరూపిస్తున్నాడు సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన రైతు మెండ మురళీకృష్ణ. అధిక పోషకాలు, ఔషధ గుణాలు అధికంగా ఉండే నల్లని వరి (బ్లాక్ రైస్) సాగుపై ఈయన ఆసక్తి కనబరుస్తున్నారు. గతేడాది ప్రయోగాత్మకంగా ఈ రకం సాగు చేపట్టారు. తనకు ఉన్న పొలంలో 20 సెంట్ల విస్తీర్ణంలో వేశారు. పంట బాగా పండింది. ఈ ఏడాది 40 సెంట్ల విస్తీర్ణంలో పంట వేశారు. కిలో విత్తనాలు రూ.400కు ఆన్‌లైన్ ద్వారా 2 కిలోలు కొనుగోలు చేశారు. 40 సెంట్ల విస్తీర్ణంలో పంట వేశారు. 80 కిలోల బస్తాలు 8 వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఎటువంటి రసాయనిక, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా సేంద్రియ వ్యవసాయం ద్వారా పండిస్తున్నారు. బస్తాకు 50 కిలోల బియ్యం వస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బియ్యం రూ.300 పలుకుతోంది. పెట్టుబడి రూ.20 వేల వరకు అవుతోంది. 400 క్వింటాళ్ల బియ్యం వస్తాయి. రూ.1,20,000 ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోను రూ.లక్ష ఆదాయం వస్తుందని రైతు తెలిపారు.



ఇది లాభదాయకమే.. నల్ల బియ్యం పంట సాగు లాభదాయకమే. గత ఏడాది ప్రయోగాత్మకంగా వేశాను. మంచి దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 40 సెంట్ల విస్తీర్ణంలో నాటాను. విత్తనాలు, నాట్లు వేసేందుకు, ఇలా పంట చివరికి వచ్చే వరకు రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. సుమారు 8 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేశాను. పెట్టుబడి పోగా రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. – మెండ మురళీకృష్ణ, రైతు బుడితి, సారవకోట మండలం

సస్యరక్షణ చర్యలిలా..

విత్తనం వేసే ముందు శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. బి.పి.టి (బాపట్ల) 2841 రకం (నల్ల బియ్యం) ఎంపికచేసుకోవాలి. ఎకరాకు 10 కిలోల వరకు విత్తనాలు వేసుకోవాలి. నాట్లు వేసే ముందు దమ్ములో ఎకరాకు 50 కిలోల డీఏపీ, యూరియా 15 కిలోలు, పొటాష్ 15 కిలోలు వేసుకోవాలి. కలుపు నివారణ మందులు పిచికారీ చేసుకోవాలి. రెండో దఫాయూరియా యూరియా 15 కిలోలు, పొటాష్ 15 కిలోలు వేసుకోవాలి. పురుగు మందులు అంతగా పిచికారీ చేయాల్సిన పనిలేదు. వ్యవసాయాధికారి కె.సిహెచ్.వెంకటరావు తెలిపారు.

దోమపోటుతో వరిపైరుకు నష్టం


వీరభద్రాపురం వద్ద దోమపోటు సోకడం వల్ల పాడవుతున్న వరిపైరు

సరుబుజ్జిలి, పొందూరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ వరి పైర్లపై దోమపోటు ఆశించి నష్టం కలిగిస్తున్నట్లు సరుబుజ్జిలి వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం తెలిపారు. వీటి నివారణ చర్యలు చేపట్టడంలో జాప్యం చేస్తే పంట నష్టం తీవ్రంగా ఉంటుంది. ఈ పైరు నుంచి ఆహారపదార్థమైన చెడువాసన రావడం వల్ల పశువులకు ఎండుగడ్డిగా కూడా ఉపయోగించడం వీలుకాదని రైతులు గుర్తించాలి. పొలానికి నత్రజని ఎరువును సిఫారసు మేరకే వాడాలి. దోమ ఉద్ధృతిని అనుసరించి శాస్త్రవేత్తలు సూచించిన పురుగు మందులను వాడుకుంటే సుడిదోమను నివారించవచ్చు. ● రైతులు చేయకూడని పనులు: సుడిదోమ ఉద్ధృతికి దోహదపడే పురుగు మందులు ప్రొఫెనోఫాస్, సైపర్‌మిత్రిన్, డెల్టామిత్రిన్, ట్రైజోఫాస్, ఫోరట్ 10జి గుళికలు వాడరాదు. ముఖ్యంగా నత్రజని ఇచ్చే అధిక రసాయనిక ఎరువులు వినియోగించరాదు.

ఇలా చేస్తే మేలు..


కాండం తొలిచే పురుగు సోకడంతో ఎండిపోతున్న వంగ మొక్క చిగుర్లు

సారవకోట, పాతపట్నం, న్యూస్‌టుడే: వంగ పైరుకు కాండం తొలిచే పురుగు సోకి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.సీహెచ్.వెంకటరావు తెలిపారు. పొలంలో గెత్తం వేసే సమయంలో ఎకరాకు రెండు కిలోల ట్రైకోడెర్మావిరిడి కలిపి వేస్తే జీవన ఎరువుగా మొక్కలకు అంది తద్వారా పురుగులు, తెగుళ్లు దూరమవుతాయి. కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించిన మొక్కల చిగుళ్ల తుంచి దూరంగా పారవేయడమో, గోతులు తీసి పాతడమో చేయాలి. ఎకరాకు కొరాజిన్ 60 గ్రా. పొడి మందును గాని, కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ 400 గ్రా. మందును గాని 200 లీటర్ల నీటిలో కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసి నివారించాలని ఏవో తెలిపారు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

చెరువుల్లో చేప పిల్లలను పెంచుతున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఏ రకాల చేపలను పెంచుకుంటే ఆదాయం పొందవచ్చు, పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేవీకే మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.బాలకృష్ణ, 9440792616 చరవాణి నంబరును సంప్రదించగలరు.

రైతేరాజు

పంటల్లో దిగుబడులు పొందాలంటే ఏయే ఎరువులు వినియోగించాలి. వాటిలో ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి. పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలి తదితర అంశాలపై కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఆయన ఇలా సమాధానమిచ్చారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



ప్రశ్న: అరటిని ఆశించే పనామా తెగులు నివారణకు చర్యలు తెలియజేయండి. – వి.రామారావు, దుస్సి, లావేరు మండలం

సమాధానం: అరటిలో పనామా తెగులు విత్తన పిలకల ద్వారా వ్యాప్తిస్తుంది. ఆమ్లత్వపు నేల ఈ తెగులును ఉద్ధృతం చేస్తుంది. తెల్లచక్కెరకేళి రకాలు కొన్ని ప్రతికూల పరిస్థితుల్లో దీనికి గురవుతాయి. దీనిని రసాయనాల ద్వారా నివారించడం సాధ్యపడదు. దీన్ని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి.

ప్రశ్న: బంతి మొక్కలు తలలు వాల్చి చనిపోతున్నాయి. నివారణకు చర్యలు తెలపండి. –కె.పద్మావతి, నరసాపూర్ అగ్రహారం, పొందూరు

సమాధానం: బంతిలో నారుకుళ్లు తెగులు నివారణకు లీటరు నీటికి కార్బండైజిమ్ 1 గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల చొప్పున కలుపుకొని మొక్కల మొదళ్ల వద్ద వేరు వ్యవస్థ తడిసేలా పోస్తే మొక్కలను కాపాడుకోవచ్చు.

చెన్నైకు గంజాయి రవాణా

ఇద్దరు యువకుల అరెస్టు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

పాతపట్నం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి ఆంధ్ర మీదుగా తమిళనాడులోని చెన్నై నగరానికి గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పాతపట్నం పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నైకు చెందిన అజయ్ కృష్ణమూర్తి, క్రితేష్ కుమార్ అనే ఇద్దరు యువకులు మద్యం, గంజాయికి బానిసలయ్యారు. అదే ప్రాంతానికి చెందిన దినేష్ అనే వ్యక్తి ఒడిశా గుణుపురం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తే రూ.పది వేలు, గంజాయిని ఇస్తానని వారికి చెప్పారు. గుణుపురంలో ఉంటున్న గౌతమ్ అనే వ్యక్తి వద్ద నుంచి 18 కేజీల సరకు తరలిస్తున్నారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పాతపట్నం వద్ద పోలీసులు వారిని తనిఖీ చేసి గంజాయి ఉన్నట్లు గుర్తించారు. సరకుతో పాటు రెండు చరవాణులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య పాల్గొన్నారు.

కాలువలో పడి మహిళ మృత్యువాత

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: తేలినీలాపురం గ్రామానికి చెందిన పైల కరువమ్మ(62) మురుగు కాలువలో పడి మృతి చెందింది. బహిర్భూమికని వెళ్లిన ఈమె మూడురోజుల క్రితమే ప్రమాదానికి గురై మృతిచెందగా, ఆమె మృతదేహాన్ని గ్రామస్థులు ఆలస్యంగా గుర్తించారు. కరువమ్మకు భర్త, పిల్లలు లేరని, బంధువులు సైతం ప్రస్తుతం తీర్థయాత్రలకు వెళ్లినట్లు గ్రామస్థులు చెప్పారు. పంచాయతీ యంత్రాంగానికి సమాచారం అందించి స్థానికులే సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

భార్య మందలించిందని బలవన్మరణం


శంకరరావు (పాత చిత్రం)

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మేజరు పంచాయతీ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన గోరుశెట్టి శంకరరావు(40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పాతపట్నం ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కులవృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న శంకరరావు మద్యానికి అలవాటు పడ్డాడు. దసరా సందర్భంగా మద్యం ఎక్కువగా తాగుతుండటంతో భార్య రాజేశ్వరి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై అదే ఊరులో ఉంటున్న తల్లి ఇంటికి వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయనకు భార్య రాజేశ్వరి, కుమారుడు పవన్, కుమార్తె తేజ ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో ఉద్యోగి మృతి


జయకుమార్ నాయక్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఉద్యోగి మృతి చెందిన ఘటన గుసాని సమితి గారబందలో సోమవారం చోటుచేసుకుంది. గారబంద ఠాణా అధికారి ప్రశాంత్ నిషిక తెలిపిన వివరాల మేరకు మెళియాపుట్టి మండలం జాడుపల్లి గ్రామానికి చెందిన జయకుమార్ నాయక్ (58) గారబంద పశువైద్య శాఖలో ఉద్యోగి. ఆదివారం రాత్రి ఆయన నివాసంలో ఉన్నారు. సోమవారం ఉదయం నాయక్ వాహన చోదకుడు ఇంటికి వెళ్లి తలుపులు కొట్టినా తెరవకపోవడంతో సమీపంలో ఉన్న వారికి సమాచారమిచ్చారు. స్థానికులు తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూసేసరికి జయకుమార్ మృతి చెంది ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని.. మృతదేహాన్ని జిల్లా ప్రధానాసుపత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

గ్రామాలకు మహర్దశ



వజ్రపుకొత్తూరు గ్రామీణం: యూఆర్‌కేపురంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శిరీష



ఇచ్ఛాపురం: కేశుపురంలో రహదారి పనులకు ఎమ్మెల్యే అశోక్ శంకుస్థాపన

వైకాపా పాలనలో పల్లెల్లో చేసిన అభివృద్ధి శూన్యమని నేతలు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంతోనే పల్లె వికాసం సాధ్యమన్నారు. గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాల రూపురేఖలు ఇకపై ఐదేళ్లలో సంపూర్ణ అభివృద్ధి చెందుతాయన్నారు. గాంధీజీ చెప్పినట్లు పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి అని తెలిపారు. –న్యూస్‌టుడే, బృందం

వలస మత్స్యకారులను ఆదుకోండి

సోంపేట, న్యూస్‌టుడే: ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న వలస మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీ వలస మత్స్యకారుల సంఘం సమన్వయకర్త కొనేటి వెంకటరావుతో పాటు ప్రతినిధులు లోకేశ్, రామారావు, అప్పయ్య, ధర్మారావు తదితరులు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు లేఖల ద్వారా సమస్యలు వివరించారు. ఏడాదిలో నాలుగు నెలలు కూడా వేట సాగడం లేదని దీంతో ఉపాధి కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో స్థానికంగా వేట సాగించేవారి పరిస్థితి ఇబ్బందికరంగా తయారైందని పేర్కొన్నారు. వేట సాగని రోజుల్లో జీవనోపాధికి సాయం చేయాలని కోరారు.

పల్లెకు ప్రగతి పండగ

- రూ.24.58కోట్లతో మౌలిక వసతుల కల్పన
- ఐదేళ్ల తరువాత అభివృద్ధి పనులకు అవకాశం

న్యూస్‌టుడే, సోంపేట, కంచిలి గ్రామీణం

వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రగతికి దూరమైన పల్లెల్లో అభివృద్ధి పనులకు అవకాశం ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు సంబంధించిన నిధులన్నీ ఇతర కార్యక్రమాలకు మళ్లించడంతో మౌలిక వసతుల ఏర్పాటుకు ఇబ్బందులు నెలకొన్నాయి. పారిశుద్ధ్యం, రహదారుల నిర్మాణం, మంచినీటి సరఫరా తదితర కార్యకలాపాలకు అవకాశం లేని పరిస్థితి. ప్రస్తుతం పంచాయతీలకు నిధులు కేటాయించడంతో పాటు జాతీయ ఉపాధిహామీ పథకం సద్వినియోగపర్చుకునేలా కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. సోమవారం నుంచి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనుల ప్రారంభంతో సందడి నెలకొంది.

ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో ఇలా

మండలం	గుర్తించిన పనులు	నిధులు (రూ.కోట్లలో)
ఇచ్ఛాపురం	154	6.25
కంచిలి	141	5.84
కవిటి	185	7.34
సోంపేట	144	5.15
మొత్తం	624	24.58



కంచిలి గ్రామీణం: మకరాంపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

వసతుల కల్పనే ధ్యేయం

కూటమి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించి అవసరాలు గుర్తించింది. ఆయా పనులు శరవేగంగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 624 పనులు గుర్తించి రూ. 24.58 కోట్లతో ఆయా పనుల నిర్వహణకు చర్యలు చేపట్టారు. సీసీ రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి సరఫరాకు సంబంధించి పనులకు ఈ నిధులు వినియోగించేలా చర్యలు తీసుకున్నారు.

గ్రామ సభల్లో గుర్తించినవే

నియోజకవర్గంలో అన్ని పంచాయతీల్లో ఆగస్టు 23న గ్రామ సభలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన గ్రామసభల్లో స్థానికులతో చర్చించి అవసరాలు గుర్తించారు. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపట్టనున్న పనులకు 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ నిధులు కేటాయించడంతో ఆయా పనులు వేగంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది.

నాణ్యతలో తేడా లేకుండా

అన్ని చోట్ల పనులు జరిగేలా చర్యలు తీసుకున్నాం. పనులు నాణ్యతతో పాటు పారదర్శకంగా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. – ఐ.వి. రమణ, డీపీఎల్‌వో, పలాస డివిజన్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638875
పలాస గ్రామీణం : 7386409926
కంచిలి గ్రామీణం : 9704568738

సమస్య : పట్టణం పంజావీధి కూడలిలో పాత విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. చర్యలు తీసుకోవాలి. - జి.లోహిదాస్, ఇచ్ఛాపురం

సమాధానం : పరిశీలించి పరిష్కరిస్తాం. - కె.గోవిందరావు, ఏఈ, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం దానగోరలోని పాఠశాల వీధిలో కాలువ లేక ఇబ్బంది పడుతున్నాం. - స్థానికులు

● త్వరలోనే నిర్మిస్తాం. - ఆశ, పంచాయతీ కార్యదర్శి, తర్లాకోట – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కాలువల్లో చెత్త వేస్తే చర్యలు

పలాస, న్యూస్‌టుడే: కాలువల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని కమిషనర్ ఎన్.రామారావు పేర్కొన్నారు. కె.టి.రోడ్డులో సోమవారం పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కాలువల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు ఎక్కువగా వస్తుండటంతో సూపర్‌వైజర్లతో పాటుగా సచివాలయ కార్యదర్శులతో మాట్లాడారు. అవగాహన కల్పించాలని సూచించారు.



పారిశుద్ధ్యపనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాలనీకి వెలుగులు

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం పుర పాలకసంఘ పరిధి జీబీఎన్ కాలనీలో వీధి దీపాలు మరమ్మతు చేశారు. 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా స్థానికులు పురాధికారులకు నివేదించారు. స్పందించిన కమిషనర్ ఎన్.రమేష్ పుర ఏఈ కామేశ్వరరావు పర్యవేక్షణలో పనులు చేయించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం

సోంపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పేర్కొన్నారు. సోమవారం సోంపేట మండలంలో పలు ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. 117 జీవో రద్దుతో పాటు కామన్ సర్వీస్ రూల్స్ సాధన లాంటి సమస్యలు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులను కాపాడేందుకు బాధ్యత తీసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

బాలలతో పని చేయించడం నేరం

సోంపేట, న్యూస్‌టుడే: బాలలను పనిలో పెట్టుకుంటే కఠినచర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సోమవారం సోంపేటలో దుకాణాలు, పరిశ్రమలు పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కార్మికుల వివరాలు సేకరించారు. 18 ఏళ్ల లోపు ఉన్న వారిని శ్రమదోపిడీకి సంబంధించిన అంశాలపై చర్చించారు. తనిఖీలో సహాయ కార్మికాధికారి ఎం.విజయ్‌కుమార్, ఏంఈవోలు ఎస్.జోరాడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాలువ ఉన్నా.. నిరుపయోగం



ఇచ్ఛాపురం పురపాలకసంఘ పరిధి రత్తకన్న ప్రధాన మార్గంలో నాయుడువీధి, ఒడియా వీధి నడుమ కాలువ పూర్తిగా ధ్వంసమైంది. వర్షం పడితే కాలువలో ఉండే మురుగు రోడ్డుపైకి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖద్వారం నుంచి చివరవీధి వరకూ కలుపుతూ వరదనీటి కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విషయమై పుర కమిషనర్ రమేష్ స్పందిస్తూ, కాలువ ప్రాంతాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

తాగునీటి కొరత




పలాస మండలం హిమగిరిలో తాగునీటి కోసం గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు సరఫరా చేసే కుళాయిల ద్వారా నీరు రావడం లేదని, వచ్చిన నీరు గ్రామంలో సగం మందికి కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిక్కులేని పరిస్థితిలో బావిలోని నీరు తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. ఇదే విషయం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ధనుంజయ దృష్టికి తీసుకెళ్లగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

రాకపోకలకు అవస్థలు

వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లేందుకు సరైన రహదారి మార్గం లేకపోవడంతో పీహెచ్‌సీకి వెళ్లే రోగులు, సిబ్బంది నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉద్దానం ప్రాంతం నుంచి వచ్చే రోగులు రైల్వే గేటుతో అవస్థలు తప్పడం లేదు. పక్కా రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఈవిషయమై ఎంపీడీవో రమేశ్‌నాయుడు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. –న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



రుద్రభూమికి దారి చూపండి



పలాస మండలం బంటుకొత్తూరు గ్రామంలో శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎవరైనా మృతి చెందితే రుద్రభూమికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని, పొలం గట్లు మీద నుంచే వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కంకర రోడ్డయినా వేయాలని కోరుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి మోహనరావు దృష్టికి తీసుకెళ్లగా....త్వరలోనే రోడ్డు వేసి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. -న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కప్పేసిన పొదలు.. కనిపించదసలు

మందస మండలం సువర్ణాపురం-ఉగ్రవానిపేట మధ్య సిమెంటు రహదారి ఇది. అర కిలోమీటరు దూరం ఉంటుంది. రెండు వైపులా పొదలు అల్లుకొని ఇరుకుగా మారింది. ఎలుగుబంటు సంచరించే ప్రాంతం కావడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆ రహదారిలో పొదలు మొత్తం తొలగించే చర్యలు చేపడతామని సర్పంచి విజయలక్ష్మి తెలిపారు. –న్యూస్‌టుడే, హరిపురం (మందస)



సౌర విద్యుత్తుతో ఆదా

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: సౌర విద్యుత్తు వినియోగం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు, విద్యుత్తు కోసం పెట్టే వ్యయం తగ్గుతుందని ఇచ్ఛాపురం విద్యుత్ ఉపకేంద్ర ఏఈ కేవీ గోవిందరావు సూచించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజావేదిక నిర్వహించి, అందరికీ సౌరశక్తి విద్యుత్తుపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఉపకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



సోలార్ పథకంపై అవగాహన కల్గిస్తున్న అధికారులు

మలుపు ఉంది జాగ్రత్త

ఇచ్ఛాపురం పట్టణం నుంచి రత్తకన్నకు వెళ్లే మార్గంలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. రైల్వేగేటు, మూడు కళాశాలలు, రెండు విద్యాలయాలు, దేవాలయంతో పాటు ఆంధ్రా, ఒడిశా గ్రామాల వారు పట్టణానికి వచ్చే మార్గం ఇదే. ఒక్కో మలుపులో ఎదుట వాహనం కనిపించని పరిస్థితి. రద్దీ రహదారిలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. అసలే ఇరుకుమార్గం.. ఆపై మలుపులు.. వీటికి తోడు రహదారిపైకి వచ్చిన ముళ్లపొదలు మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ విషయమై ర.భ.శాఖ డీఈఈ రామినాయుడు వద్ద ప్రస్తావించగా, రహదారిని పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు అమలు చేస్తామని చెప్పారు. కనిపిస్తున్న చిత్రం రైల్వేగేటు సమీపంలోనిది. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

మందస, న్యూస్‌టుడే : మందస మండలం కిల్లోయి వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అంబుగాంబొడ్డులూరుకు చెందిన భీమారావు, పురుషోత్తం సోమవారం ద్విచక్ర వాహనంపై మందస వైపు వెళ్తుండగా వాహనం అదుపుతప్పడంతో నడిచి వెళ్తున్న బృందావన గౌడను ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పలాస సామాజిక ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మందస పోలీసులు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవం



సుందరంగా తీర్చిదిద్దిన ఆలయం

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని చినడోకులపాడు గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నేడు (మంగళవారం) శ్రీ పాతపట్నం, మరిడి, చండీ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. పూజలు, హోమం కార్యక్రమాలతో పాటు అన్న సంతర్పణ చేయనున్నట్లు తెలిపారు.

కొత్త భవనాలకు గ్రహణం



కంచిలి మండల కేంద్రంలోని కొత్తగా నిర్మించిన ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్, వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్ కేంద్రం 90శాతం మేర పనులు పూర్తి నిలిపివేయడంతో నిరుపయోగంగా మారింది. గుత్తేదారు అర్ధాంతరంగా పనులు విడిచిపెట్టి వెళ్లడంతో వినియోగానికి నోచుకోవడం లేదు. దీంతో పరిసరాల్లో పనికిరాని మొక్కలు పెరిగి దారి కూడా లేని విధంగా తయారైంది. రూ. లక్షలు ఖర్చుచేసి నిర్మించిన ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వం మారినప్పటికీ ఈ కేంద్రం పేరు వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌గానే కొనసాగుతుండటం గమనార్హం. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ హిమసాగర్ వివరణ కోరగా లోపలి భాగంలో కొన్ని పనులు చేపట్టాల్సి ఉందన్నారు. గుత్తేదారుకి కొంత మేర బిల్లులు చెల్లింపులు కాకపోవడంతో పనులు ఆపేశారని మాట్లాడి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. -న్యూస్‌టుడే, కంచిలి

తొమిదేళ్లయినా.. నెరవేరని శుద్ధజల కల

న్యూస్‌టుడే, హరిపురం (మందస)

పథకం ఏదైనా ప్రజాప్రయోజనం నూరు శాతం జరగడంతోపాటు పది కాలాలపాటు వినియోగించేలా ఉండాలి. మందస మండలం మారుమూల కొండ ప్రాంతాల్లో కొన్ని నీటి పథకాలు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా.. ఏర్పాటు జరగలేదు. దీంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయి.



పెదంగొ పాఠశాల వద్ద ఆరుబయట వదిలేసిన శుద్ధజల ప్లాంటు



బుడార్శింగిలో వృథాగా పడిఉన్న ట్యాంకు

సామగ్రి మూలకు

వాటర్‌షెడ్ ద్వారా అభివృద్ధి పనుల్లో భాగంగా బుడార్శింగి, పెదంగొలో రూ.8 లక్షలతో శుద్ధజల ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పలు అడ్డంకులతో నేటికీ కార్యరూపం దాల్చలేదు. అందుకు అవసరమైన సామగ్రి సైతం ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగలేదు. బుడార్శింగి పంచాయతీ కార్యాలయం వద్ద ఒకటి, పెదంగొ పాఠశాల భవనం వద్ద మరొకటి తెచ్చి పడేశారు. తొమ్మిదేళ్లుగా అవి ఆరుబయటే పడి ఉన్నాయి. రూ.లక్షల విలువ చేసే సామగ్రి నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారుల తీరును తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా రెండు గ్రామాల్లో అమర్చి ప్రజలకు శుద్ధజలం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు

బుడార్శింగి, పెదంగొలో శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేయాలని వాటర్‌షెడ్ అధికారులు భావించినా.. కార్యరూపం దాల్చలేదు. అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినా.. స్పందన లేకుండా పోయింది. – సురేష్ పాణిగ్రహి, సర్పంచి, బుడార్శింగి

పరిశీలిస్తాం

బుడార్శింగి, పెదంగొలో వాటర్‌షెడ్ ద్వారా శుద్ధజల ప్లాంట్లు మంజూరు, ఏర్పాటు విషయమై పరిశీలిస్తాం. పరికరాలు బాగుంటే అమర్చి సమస్య తీరుస్తాం. – పి.సూర్యనారాయణ, ఎంపీడీఓ, మందస.

ఇబ్బందులు తీర్చారు



పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో యువశక్తి యువజన సంఘం, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్మించిన బస్‌షెల్టర్ ఆదివారం యవశక్తి యువజన సంఘం సభ్యులు ప్రారంభించారు. గ్రామంలో వృద్ధులు, మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతుండటంతో సొంత డబ్బులతో బస్ షెల్టర్ నిర్మించినట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో యవశక్తి యువజన సంఘం అధ్యక్షుడు సైని మధు, సాయి, చిరంజీవి, పురుషోత్తం, జగదీశ్, గౌతమ్, రవి, రేవతీపతి తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

పైడితల్లిని దర్శించుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం పైడితల్లి అమ్మవారిని ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను కలిశారు.



సంక్షిప్త సమాచారం

సరస్వతిదేవికి ఎమ్మెల్యే పూజలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: జ్ఞానసరస్వతి దేవి కటాక్షంతోనే పండితులు, పామరులకు జ్ఞానసముపార్జన సాధ్యమవుతుందని, పల్లెల్లో నేటికీ అమ్మవారికి ఉత్సవాలు చేయడం ఆనందకరమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలం బూర్జపాడులో నిర్వహిస్తున్న సరస్వతి పూజలో సోమవారం పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు.

విజేతలకు అభినందన

హరిపురం (మందస), న్యూస్‌టుడే : ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి వివిధ ప్రాంతాల్లో వరుసగా నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో మందస మండలం హరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతులు గెలుపొందారు. పాఠశాలలో వీరికి సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం ఉమారాజ్, సర్పంచి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

జైహింద్ ఫౌండేషన్ వితరణ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : కవిటి మండలం గొర్లెపాడు గ్రామానికి చెందిన శ్రీకాంత్ పలు రుగ్మతలతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న జైహింద్ ఫౌండేషన్ సోమవారం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేసింది.



ఎలుగుబంట్ల సంచారం

పలాస గ్రామీణం: మందస, పలాస సరిహద్దులోని ఉద్దానం ప్రాంతంలో 3 ఎలుగుబంట్లు హల్‌చల్ చేశాయి. తోటల్లో నుంచి జన సంచారం కలిగిన ప్రాంతాల్లోకి రావడంతో ప్రజలు భయాందోళన చెందారు. వారంతా గట్టిగా అరవడంతో ఎలుగుబంట్లు అడవిలోకి వెళ్లిపోయాయి. ఎలుగుల సంచారంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని, వాటి రాకకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు అటవీ అధికారులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో జవాన్‌కు గాయాలు

ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలో ఏబీ రహదారిపై రావిచెంద్రి- కోవిలాం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ఓ వ్యక్తి గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. సారవకోట మండలం గోపాలపురం గ్రామానికి చెందిన తర్ర గురునాథం అనే ఆర్మీ జవాన్ మండలంలోని మోదుగువలస పునరావాస కాలనీలోని అత్తవారి ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. రావిచెంద్రి సమీపంలో కొత్తూరు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు.

ఈ-పంట అర్హుల జాబితా ప్రకటన

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం మండల పరిధిలో ఈ-పంట నమోదుపై జరిగిన సామాజిక తనిఖీల అనంతరం అర్హుల జాబితాను ప్రకటిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో ఈ జాబితాను బుధవారం వరకూ ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వాటిని పరిశీలించి చేర్పులు, మార్పులు ఉంటే, ఆ సచివాలయంలోని వ్యవసాయ సహాయకుల వివరాలు అందివ్వాలని ఆమె సూచించారు. తేలుకుంచి సచివాలయంలో తొలి జాబితాను ప్రదర్శించారు.



తేలుకుంచిలో జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయ, గ్రామ అధికారులు

? నందిగాం మండలం పెద్దతామరాపల్లి వీధి కాలనీలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - టొంప చిన్నారావు, పెద్దతామరాపల్లి

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం - చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి, పెద్దతామరాపల్లి - న్యూస్‌టుడే, నందిగాం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

పరిజ్ఞానం పెంచుకునేలా బోధించాలి



విద్యార్థులు విషయాలపై పరిజ్ఞానం పెంచుకునేలా ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి విజయకుమారి సూచించారు. సత్యవరం జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన, దస్త్రాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్ఎం వకుళా రత్నమాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, నరసన్నపేట



పోలాకి: ఉరజాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



పాతపట్నం: రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజల చెంతకు అభివృద్ధి ఫలాలు

ప్రజల చెంతకు అభివృద్ధి ఫలాలు చేరేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పేర్కొన్నారు. సోమవారం టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా 'పల్లె పండగ' కార్యక్రమం సందడిగా జరిగింది. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరించిందని, పల్లెలకు పూర్వ వైభవం తీసుకొస్తామని వక్తలు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే బృందం



కోటబొమ్మాళి మండలం చిట్టివలసలో..



మెళియాపుట్టి: 'పల్లె పండగ' కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు



నరసన్నపేట: తామరాపల్లిలో రహదారి పనులు ప్రారంభం

ఉండలేరు.. వెళ్లలేరు..!

- న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం, జలుమూరు, సారవకోట

కాలనీలు కాదు సకల సౌకర్యాలతో ఊళ్లు నిర్మించి నిరుపేదల జీవన స్థితి గతులనే మార్చేస్తామని గత పాలకులు హామీలు ఇచ్చారు. ఆ మాటలు నీటి మీద రాతలు గానే మిగిలి పోవడంతో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో గత ప్రభుత్వం సేకరించిన స్థలాలకు సరైన సౌకర్యాలు కల్పించక పోవడంతో పాటు రహదారులను ఏర్పాటు చేయక పోవడంతో కాలనీల్లోని లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల చిన్నపాటి వర్షం పడినా రోడ్లు బురదతో దమ్ము చేసిన పొలాలను తలపిస్తున్నాయి.



ఉర్లాం జగనన్న కాలనీలో చిన్నపాటి వర్షానికే అధ్వానంగా మారిన రోడ్డు

బురదలోనే రాకపోకలు

నరసన్నపేట మండలం ఉర్లాంలో రైతులు పొలాలకు వెళ్లేందుకు వినియోగించే మట్టి దారితో పాటు ఆక్రమణలు తొలగించి లబ్ధిదారులకు జగనన్న లే అవుట్ ఏర్పాటు చేశారు. ఇందులో 53 మందికి ఇళ్లు మంజూరు చేయగా 44 మంది పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నారు. రహదారిని అభివృద్ధి చేయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదలోనే రాకపోకలు సాగించాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు లేకపోవడంతో మురుగు రహదారి పైనే నిలిచిపోతుంది. ఈ విషయమై సర్పంచి పోలాకి నరసింహమూర్తిని వివరణ కోరగా ఉపాధిహామీ పథక నిధులతో రహదారిని అభివృద్ధి చేసేందుకు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులకు అందజేశామని తెలిపారు.

ముందుకు సాగని పనులు

జలుమూరు మండలంలో వివిధ కారణాలతో పనులు ముందుకు సాగలేదు. కొన్ని చోట్ల లేఅవుట్లు గ్రామాలకు దూరంగా ఉండటంతో ఇళ్లు నిర్మించేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. జలుమూరు లే అవుట్‌కు రహదారి సౌకర్యం లేకపోవడంలో నిర్మాణాలు పూర్తి అయినప్పటికీ లబ్ధిదారులు నివసించేందుకు ఆసక్తి కనబరచడం లేదు. ప్రతిపాదనలు పంపామని గృహనిర్మాణశాఖ ఏఈ ప్రసాదరావు చెప్పారు.



జలుమూరు కాలనీలో రహదారి దుస్థితి

గ్రామాలకు దూరంగా..

సారవకోట మండలంలోని అవలంగి, బుడితి, చీడిపూడి గ్రామాలకు చెందిన వంద మందికి పైగా లబ్ధిదారులకు సంబంధించి అవలంగి గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో స్థల సేకరణ చేసి బోరు కూడా ఏర్పాటు చేశారు. గ్రామానికి దూరంగా స్థలం ఉండటంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ఆసక్తి చూపడంలేదు. అధికారులు పలుమార్లు నిర్మాణాలు చేపట్టాలని సూచించినప్పటికీ ఫలితం లేదు. చీడిపూడి గ్రామానికి సమీపంలో ఉన్న స్థలాన్ని కేటాయిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని వారంతా విన్నవించారు. ఈ విషయాన్ని సర్పంచి పావని వద్ద ప్రస్తావించగా కనీస సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని చెప్పారు.

చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం



సారవకోట: మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

సారవకోట, నరసన్నపేట, న్యూస్‌టుడే: చట్టాలపై అవగాహన కల్పించడమే న్యాయ విజ్ఞాన సదస్సుల లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. సారవకోట మండల పరిషత్తు సమావేశ భవనంలో సోమవారం జరిగిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి మాట్లాడుతూ వేధింపులకు గురైతే ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితుల్లో మహిళలు ఉన్నారని, ఇటువంటి వారికి న్యాయ విజ్ఞాన సదస్సులు ఉపకరిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీవో మోహనకుమార్, ఎస్ఐ అనిల్‌కుమార్, డీసీపీవో కె.రమణ, రిసోర్స్ పర్సన్లు హరిప్రియ, సౌమ్య పాల్గొన్నారు. ● ఖైదీలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు సూచించారు. నరసన్నపేట ఉప కారాగారంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. సూపరింటెండెంట్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో విద్యుత్తు కేంద్రం



సారవకోట మండలంలోని నౌతళ విద్యుత్తు ఉపకేంద్రం పరిస్థితి అధ్వానంగా మారింది. 8 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం తలుపు విరిగిపోవడంతో పాములు లోపలికి ప్రవేశిస్తున్నాయని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కిటికీలకు అమర్చిన గాజు పలకలు సైతం విరిగిపోయాయి. కేంద్రానికి రోడ్డు సౌకర్యం లేదు. అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వినియోగదారులు, సిబ్బంది కోరుతున్నారు. ఈ విషయాన్ని ఏఈ రమేష్ వద్ద ప్రస్తావించగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, సారవకోట

అపాయం.. అప్రమత్తత అవసరం



నరసన్నపేట మండలం లుకులాం సమగ్ర రక్షిత నీటి పథకానికి సంబంధించిన 11కేవీ విద్యుత్తు లైన్‌లో జల్లువానిపేట సమీపంలో విద్యుత్తు స్తంభం నుంచి నిప్పులు రాలుతున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉర్లాం విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి నిప్పులు రాకుండా నియంత్రిస్తామన్నారు. - న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

పశువైద్యం.. కడు దైన్యం..!



నౌపడలో 30 ఏళ్ల కిందట నిర్మించిన పశువైద్యశాల శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే దస్త్రాలు, మందులు తడిసి పోతున్నాయని వాపోతున్నారు. ఈ పశువైద్యశాల పరిధిలో 14 గ్రామాలు ఉన్నాయి. వైద్యం కోసం వచ్చే పాడి రైతులు సైతం వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. భవనం మరమ్మతులు, ఇతర సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపించామని వైద్యాధికారి అశోక్ చెప్పారు. - న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

అసలే మలుపు.. ఆపై పొదలు

నందిగాం నుంచి పెంటూరు, నరేంద్రపురం మీదుగా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం వరకు సుమారు 7 కి.మీ. బీటీ రహదారికి ఇరువైపులా పనికి రాని మొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ముళ్లపొదలు తొలగిస్తామని ఆర్ అండ్‌బీ శాఖ ఏఈ సతీష్ పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, నందిగాం



సేకరణ సరే తరలించేదెప్పుడు..?



టెక్కలిలో పాతజాతీయ రహదారి నుంచి సుదర్శన్ థియేటర్ రోడ్డు మీదుగా చిన్నబజారుకు వెళ్లే మార్గంలో చెత్తకుప్పలు స్థానికుల సహనానికి పరీక్షగా మారుతున్నాయి. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను సిబ్బంది అక్కడ పోగుగా వేస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఏ రోజు చెత్త ఆరోజు తొలగించాలని కోరుతున్నారు. సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో లేరని, శుభ్రం చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు తెలిపారు. - న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

అచ్చెన్నకు వినతుల వెల్లువ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి సోమవారం వినతులు వెల్లువలా వచ్చాయి. నిమ్మాడలోని ఆయన కార్యాలయానికి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, యువకులు, మహిళలు, అధికారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సమస్యలను తెలియజేస్తూ అర్జీలు అందజేశారు. పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులకు అచ్చెన్న సూచించారు.

గంగమ్మ ఒడికి దుర్గమ్మ



ఎల్ఎన్‌పేటలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

ఎల్ఎన్‌పేట, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండలంలో దసరా ఉత్సవాలు ముగిశాయి. కోవిలాం, పెద్దకోట, కుసుమలపాడు, కరకవలస, కృష్ణాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. కోటబొమ్మాళి మండలం కన్నేవలసలో చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధుల మంజూరు

పోలాకి, న్యూస్‌టుడే: మండలంలోని ఏడు గ్రామాలకు సంబంధించి రహదారుల అభివృద్ధికి జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి రూ.4.54 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో జి.వి.రవికుమార్ తెలిపారు. ఉరజాం- నరసాపురం మార్గానికి రూ.50 లక్షలు, రహమాన్‌పురంలో సీసీ రోడ్డుకు రూ.38 లక్షలు, వనితమండలంలో అసంపూర్తిగా ఉన్న రహదారి కోసం రూ.127 లక్షలు, చెల్లాయవలసలో సీసీ మార్గానికి రూ.25 లక్షలు, గొల్లలవలస తారురోడ్డుకు రూ.120 లక్షలు, చీడివలస సీసీ రహదారికి రూ.34 లక్షలు, చెల్లాయవలసలో తారు రోడ్డుకు రూ.60 లక్షలు మంజూరైనట్లు సోమవారం ఆయన చెప్పారు.

దరఖాస్తులకు నేటితో గడువు పూర్తి

సారవకోట, న్యూస్‌టుడే: కేజీబీవీల్లో ఖాళీగా ఏడు రకాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మండల విద్యా వనరుల కేంద్రాల్లోనూ దరఖాస్తులు అందించవచ్చని సూచించడంతో సారవకోటలోని కార్యాలయానికి సోమవారం నాటికి 50 మంది దరఖాస్తులు అందినట్లు ఎంఈవో ఎం.వెంకటరమణ తెలిపారు. మంగళవారంతో గడువు పూర్తవుతుండటంతో సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు.

అవీ..ఇవీ..అన్నీ

గడ్డి కుప్ప దగ్ధం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని 9వ లైనులో బత్తుల నారాయణరావుకు చెందిన గడ్డి కుప్ప సోమవారం దగ్ధమైంది. మధ్యాహ్న సమయంలో మంటలు చెలరేగి పొగ కమ్ముకోవడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

పెనుగోటివాడలో వైద్య శిబిరం

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెనుగోటివాడలో కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన వివాహిత రాధ జ్వరంతో మృతి చెందడంతో అధికారులు స్పందించారు. అనుమానితులకు పరీక్షలకు చేసి, మందులు అందించారు. దోమల నివారణకు ద్రావణాన్ని పిచికారీ చేయించారు. మలేరియా నివారణ అధికారి నరసింహాచారి, ఆరోగ్య విస్తరణాధికారి పి.బుజ్జిబాబు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో మెరిసిన భాస్కరరావు



నరసన్నపేట, న్యూస్‌టుడే: అంతర్ జిల్లా రెజ్లింగ్ పోటీల్లో నరసన్నపేటకు చెందిన ఎన్.భాస్కరరావు ద్వితీయ స్థానం సాధించారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో ఈ క్రీడాకారుడు ఇటీవల విజయవాడలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపాడు. కళాశాల డైరెక్టర్ దుర్గా ప్రసాద్, ప్రిన్సిపల్ ముసలినాయుడు, ఏవో మోహన్‌దాస్ అభినందనలు తెలిపారు.

ప్రతీ విద్యార్థికి అపార్ నంబరు కేటాయింపు

హిరమండలం, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి అపార్ నంబరు కేటాయించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని ఎంఈవో కె.రాంబాబు పేర్కొన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి విద్యార్థి వివరాలు ఆయా పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం విధిగా నమోదు చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో జవాన్‌కు గాయాలు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలో ఏబీ రహదారిపై రావిచెంద్రి- కోవిలాం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ఓ వ్యక్తి గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. సారవకోట మండలం గోపాలపురం గ్రామానికి చెందిన తర్ర గురునాథం అనే ఆర్మీ జవాన్ మండలంలోని మోదుగువలస పునరావాస కాలనీలోని అత్తవారి ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. రావిచెంద్రి సమీపంలో కొత్తూరు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు.

విద్యా పురస్కారాల అందజేత

పాతపట్నం, న్యూస్‌టుడే: తెంబూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థితో పాటు ఉపాధ్యాయులను సోమవారం సత్కరించారు. రామరాజు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కె.శరణ్యకు విద్యా పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.విశ్వనాథం, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



టెట్‌కు 80 మంది గైర్హాజరు

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలకు సోమవారం 80 మంది గైర్హాజరయ్యారు. స్థానిక కోర్ టెక్నాలజీ సెంటర్‌లో జరిగిన పరీక్షలకు మొత్తం 660 మంది అభ్యర్థులకు గానూ 580 మంది హాజరయ్యారని పరీక్షా కేంద్రం డిపార్ట్‌మెంటల్ అధికారి దాలినాయుడు తెలిపారు.

ఆదేశాలు గాలికి.. చెత్త గ్రామ శివారుకు..!



అలుదులో చెత్తకు నిప్పు పెట్టడంతో జాతీయ రహదారిపైకి వస్తున్న పొగ

- న్యూస్‌టుడే, సారవకోట

గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టించాలని ప్రభుత్వం నిర్ణయించి అవసరమైన ఆదేశాలు జారీ చేసింది. గ్రామాల్లో ఇప్పటికే నిర్మించిన సంపద తయారీ కేంద్రాలను అక్టోబర్ 2న తిరిగి ప్రారంభించాలని సూచించింది. సారవకోట మండలంలోని సారవకోట, గొర్రిబంద, వాండ్రాయి, కోదడ్డపనస, నౌతళ, మదనాపురం, బద్రి తదితర గ్రామాల్లో భవనాలు ఉన్నప్పటికీ ఎక్కడా వినియోగంలోకి రాలేదు. సేకరిస్తున్న చెత్తను గ్రామాల సమీపంలో, సంపద కేంద్రాలకు పక్కన కుప్పగా పారవేస్తున్నారే తప్ప పొడి, తడిగా వేరుచేసే పరిస్థితి లేదు.



మాకివలస వద్ద పిల్లర్ల దశలో నిలిచిపోయిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ఇదీ పరిస్థితి..

సారవకోట మండలంలోని అలుదు గ్రామం వ్యాపారపరంగా అభివృద్ధి చెందింది. జాతీయ రహదారికి సుమారు కిలోమీటరు పొడవునా ఆనుకొని ఈ గ్రామం ఉంది. సుమారు 600 కుటుంబాలు ఉండగా, 3

పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాని కేంద్రాలు

వేలు జనాభా. అలుదులో సంపద తయారీ కేంద్రం నిర్మించడానికి స్థలం లేకపోవడంతో కిలోమీటరుకు పైగా దూరమున్న ఇదే పంచాయతీ మాకివలస సమీపంలో కొండ అంచున స్థల సేకరణ చేశారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు కావడంతో గుత్తేదారు పనులు ప్రారంభించి పిల్లర్ల వరకు నిర్మించి విడిచి పెట్టేశారు. ఏడాది కాలంగా తిరిగి నిర్మాణం ప్రారంభం కాలేదు. అలుదులో నిత్యం సేకరిస్తున్న చెత్తను గ్రామానికి సమీపంలో జాతీయ రహదారికి అనుకొని కుప్పగా వేస్తున్నారు. వ్యర్థాలకు వారానికి ఒకసారి నిప్పు పెడుతున్నారు. దీంతో జాతీయ రహదారిపైకి అనుకొని రోజంతా పొగ వ్యాపిస్తుండటంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టించాలని సూచిస్తున్నప్పటికీ ఈ గ్రామంలో అవేవీ అమలు కావడం లేదు. సమస్యపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా

వాండ్రాయిలోని కేంద్రం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. గ్రామానికి 1.5 కిలోమీటర్ల దూరంలో నిర్మించడమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు చెబుతున్నారు. మదనాపురం కేంద్రాన్ని పంచాయతీ పరిధిలోని చంద్రయ్యపేట సమీపంలో నిర్మించారు. ఈ భవనం సైతం నిరుపయోగంగా మారింది. ఇదే పరిస్థితి చాలా గ్రామాల పరిధిలో ఉంది.

కార్యదర్శులకు సూచనలిస్తాం..

ఇటీవల మండలానికి బదిలీపై వచ్చాను. మండలంలోని అన్ని కేంద్రాలు వినియోగంలోకి రావాలని ఇప్పటికే కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. మరోసారి అవసరమైన సూచనలిస్తాం.

- ప్రభాకరరావు, ఈవోపీఆర్డీ, సారవకోట

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



పూజలు చేస్తున్న భక్తులు

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలో బ్రహ్మకుమారీస్ భవనంలో సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన మంజునాథం గురూజీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. మండలానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హరివిల్లు సొగసు.. దోచెను మనసు



కోటబొమ్మాళిలో సోమవారం ఉదయం వాతావరణం చల్లబడటం, చిన్నపాటి వర్షం కురవడంతో ఆకాశంలో ఇంద్రధనస్సు ఏర్పడింది. పలువురు దీనిని ఆసక్తిగా చూసి, చరవాణితో ఫొటోలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

తెరపై ఈనాడు

★ కీర్తన: రామ్‌నగర్ బన్నీ ★ కీర్తి: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: దేవర ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: జనక అయితే గనక ★ మారుతి: మా నాన్న సూపర్ హీరో – న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

● శ్రీకాకుళం ● ఆమదాలవలస ● ఎచ్చెర్ల

క్రీడాకారిణికి అభినందన



సాధించిన పతకాలతో వర్షిత

గార, న్యూస్‌టుడే: మండల పరిధి అంపోలు పంచాయతీ ఆడవరం గ్రామానికి చెందిన గుజ్జల వర్షిత జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించింది. సోమవారం ఆమె స్వగ్రామానికి రావడంతో గ్రామస్థులు స్వాగతం పలికారు. పూలమాలలు వేసి జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు ర్యాలీగా తీసుకొచ్చారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భోగెల ఉమామహేశ్వరరావు తదితరులు సత్కరించారు.

100 రోజుల్లో సంతృప్తికర పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో శ్రీకాకుళం నియోజకవర్గంలో పలు మంచి కార్యక్రమాలు నిర్వహించిందని.. ఇవేమీ మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌కు కనిపించలేదా? అని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరం విశాఖ ఏ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'వైకాపా పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. కూటమి ప్రభుత్వం వాటిని గాడిలో పెడుతుండటాన్ని ప్రజలు గమనించి అభిమానిస్తున్నారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డు, నగరంలో కోడిరామమూర్తి స్టేడియం నిర్మాణ పనులను పట్టాలెక్కించాం. క్రీడాకారులను మోసం చేసి పాలాభిషేకం చేయించుకున్న ధర్మాన సోదరులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. ఖరీఫ్‌లో రైతులు ఇబ్బంది పడకుండా అన్ని కాలువల్లో పూడిక తీయించి సాగునీరు పారేలా చేశాం. శ్రీకాకుళంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఎత్తు చేసి వర్షం పడినప్పుడు తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. పొన్నాం, బట్టేరు వద్ద కోతకు గురైన ప్రాంతాలను గుర్తించి కొత్త గట్టు నిర్మించాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెదేపా నేతలను విమర్శించే నైతిక హక్కు ధర్మాన కృష్ణదాస్‌కు లేదు' అని ఎమ్మెల్యే శంకర్ పునరుద్ఘాటించారు.

నూకాలమ్మా! చల్లగా చూడమ్మా!



పాత శ్రీకాకుళంలో నూకాలమ్మ తల్లి

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాత శ్రీకాకుళంలోని నూకాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం అమ్మవారికి అభిషేకం, పసుపు, కుంకుమలతో అర్చన, ముర్రాటలతో చల్లదనోత్సవం నిర్వహించారు. నూకాలమ్మా చల్లగా చూడమ్మా అంటూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సమీప కాలనీలకు చెందిన భక్తులు మేళతాళాలు, డప్పుల విన్యాసాలతో ఊరేగింపుగా వచ్చారు. ❖ బలగలో రామ మందిరం వద్ద భక్తుల మండల దీక్షలు కొనసాగుతున్నాయి. రోజూ ఉదయం సామూహికంగా నామ సంకీర్తనలు, సాయంత్రం భజనలు నిర్వహిస్తున్నారు. ❖ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బలగ కాలభైరవాలయంలో కొలువుతీర్చిన దుర్గామాత విగ్రహాన్ని నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. ఆలయ వ్యవస్థాపకులు గణేష్‌స్వామి ఆధ్వర్యంలో ఎడ్లబండిపై విగ్రహాన్ని మేళతాళాలు, భవానీ దీక్షాధారుల శరణుఘోషతో ఊరేగించి నిమజ్జనం చేశారు. బలగ సమీప కాలనీలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఆచార్య సాయిబాబా సేవలు ఎనలేనివి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేసిన విద్యావేత్త ఆచార్య జి.ఎన్.సాయిబాబా సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. శ్రీకాకుళం నగరంలోని ఇల్లీసుపురం అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో సోమవారం జిల్లా దళిత, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐకాస నాయకుడు ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ ఆదివాసీలు, దళితుల హక్కుల కోసం, రాజ్యాంగ నిర్బంధాన్ని ఎదురించి పోరాడిన గొప్ప వ్యక్తి సాయిబాబా అని వ్యాఖ్యానించారు. ఐకాస నాయకులు బి.అప్పారావు, కె.వేణు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలం బురిడికంచరాం పంచాయతీకి సంబంధించిన నిధులు దుర్వినియోగం చేశారంటూ తెదేపా మండల ప్రధాన కార్యదర్శి, గ్రామ నాయకుడు వండాన మురళీ సోమవారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులతో సీసీ రహదారులు, కాలువల నిర్మాణం చేయకుండా నిధులు డ్రా చేశారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పనుల ఎస్టిమేషన్, ఎం.బుక్ కాపీలను ఫిర్యాదుతో జతపరిచినట్లు తెలిపారు. అసిరితల్లి గుడి నుంచి రామారావు ఇంటి వరకు సీసీ రహదారి వేయకుండా సుమారు రూ.2.93 లక్షల బిల్లు డ్రా చేశారని, దీనిలో పంచాయతీ సర్పంచితో పాటు ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

సీఐ బాధ్యతల స్వీకరణ



శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా మహిళా పోలీసుస్టేషన్ సీఐగా త్రినేత్రి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా పోలీసుస్టేషన్‌కు సంబంధించిన అంశాలపై కొద్దిసేపు చర్చించారు.

క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభించాలి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టు అధ్యాపకులు కోరారు. మండలంలోని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వ పెద్దల దృష్టికి తమ సమస్యలు తీసుకువెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు చేపడుతున్నట్లు చెప్పారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీసులను క్రమబద్ధీకరించేందుకు ఉద్దేశించిన యాక్టు 30, జీవో నంబరు 114ను వెంటనే అమలు చేయాలని కోరారు.

అక్కలనాయుడు మాస్టారుకు ఘన నివాళి

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరులోని యంగ్ స్టార్స్ యూత్ క్లబ్ వ్యవస్థాపకుడు, దివంగత అనకాపల్లి అక్కలనాయుడు మాస్టారు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన ద్వితీయ వర్ధంతి కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు కె.శాంతారాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అక్కలనాయుడు విగ్రహానికి సర్పంచి రేగిడి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు అనకాపల్లి వాణి, మాజీ సర్పంచి అనకాపల్లి విజయలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉచిత కుట్టు శిక్షణ

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరులో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి స్కిల్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం ఏర్పాటు చేస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఇందులో ఉచిత కుట్టు(టైలరింగ్), ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్‌పై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు సత్యసాయి మందిరంలో సంప్రదించాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డి.రాధాకృష్ణ తెలిపారు.

శాలిహుండం ఆక్రమణలపై ఫిర్యాదు

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరులోని అంబేడ్కర్ కూడలి సమీపంలో సర్వే నంబరు 198లో శాలిహుండం వేణుగోపాలస్వామి ఆలయ ట్రస్టుకు సంబంధించిన భూమిలో ఓ వ్యక్తి ఆక్రమణలకు పాల్పడ్డాడు. దీంతో ట్రస్టు ఛైర్మన్ మధురెడ్డి, దేవాదాయశాఖ అధికారులు ప్రసాదబాబు, దుర్గాప్రసాద్‌లు సోమవారం ఆ భూమిని పరిశీలించి మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ భూమిలో నందల వ్యాపారం నిర్వహిస్తున్న కె.భూలోకను నాలుగు రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించారు. త్వరలోనే ట్రస్టు భూమిని ఆక్రమించిన వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని ట్రస్టు ఛైర్మన్ మధురెడ్డి తెలిపారు.

రాజరాజేశ్వరి పీఠంలో అన్నదానం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గుజరాతీపేటలోని రాజరాజేశ్వరి పీఠంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు పెంట రామచంద్రశేఖర్ శర్మ భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. పెంట వాశిష్ట కార్తికేయశర్మ తదితరులు సేవలు అందించారు.

17న సీజీఆర్ఎఫ్ సమావేశం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న శ్రీకాకుళం నగరంలోని కార్యనిర్వాహక ఇంజినీరు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యురాలు ఎస్.మసిలామణి హాజరై ఫిర్యాదులు స్వీకరిస్తారని విద్యుత్తు శాఖ అధికారులు తెలిపారు.

సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా నుంచి 70 మంది పాల్గొని 26 పతకాలు సాధించారు. వారిలో 9 మంది సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారు. పరుగు పందెంలో వి.రాజేశ్, బి.హారిక, జంప్స్‌లో ఎం.మౌనిక, పి.అశోక్, పి.అశ్విత, త్రోస్‌లో టి.తరుణ్, కె.యాదగిరి, ఎం.రుషికుమార్, పెంటాథ్లెన్‌లో జి.అభిరామ్ ఎంపికయ్యారు. క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు కె.మధుసూదనరావు, ఎన్.విజయ్‌కుమార్, బి.వి.రమణ, కె.మాధవరావు, కె.హరిబాబు, టి.శ్రీనివాసరావు అభినందించారు.

పుర వాసులకు తాగునీటి కష్టాలు..!

★ మున్సిపాలిటీకి దూరంగా ఉన్న వార్డులకు అందని కుళాయి నీరు

★ కూటమి ప్రభుత్వం, నాయకుల పైనే ప్రజల ఆశలు

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో ప్రతి రోజూ రెండు పూటలా మంచినీటిని అందించాల్సి ఉంది. అయినా నేటికీ కొన్ని వార్డులకు అందే పరిస్థితి లేదు. దీనికి ప్రధాన కారణం సుమారు 30 ఏళ్ల కిందట వేసిన ప్రధాన పైపులైన్లు దెబ్బతినడమే. దీంతో అక్కడక్కడ లీకుల సమస్య పునరావృతం అవుతోంది. దీంతో రెండు పూటలా ఆయా వార్డుల్లో కుళాయిల నీరు అందడం లేదు. తాగునీటి కుళాయిలు లేని వార్డుల్లో ట్రాక్టర్ల ద్వారా నీటిని మున్సిపాలిటీ సిబ్బంది ప్రజలకు అందిస్తున్నారు.

ట్రాక్టర్లతో నీరు అందిస్తున్న వార్డులు: మున్సిపాలిటీకి దూరంగా ఉన్న 1వ వార్డు తిమ్మాపురం, జగ్గుశాస్త్రులుపేట, పార్వతీశంపేట, 4వ వార్డు గేదెలవానిపేట, కొరివలస, గేదెలపేట, 5వ వార్డు రెడ్డిపేట, సొట్టవానిపేట, పంతులపేట, 6వ వార్డు సప్తపురాలు, నందగిరిపేట, తురకపేట, పంతులపేట, టి.మన్నయ్యపేట, కె.మన్నయ్యపేట, 7వ వార్డు చింతాడ, చింతాడ కాలనీ, 21వ వార్డు కుద్దిరాం, మెట్టక్కివలసలోని కొంత ప్రాంతం తదితర వార్డుల్లో ఇప్పటికీ తాగునీటి కుళాయిలు లేకపోవడంతో ట్రాక్టర్లతో నీటిని అందిస్తున్నారంటే సమస్య ఎలా ఉందో అర్థమవుతోంది.



చింతాడ ప్రభుత్వ పాఠశాల వద్ద తాగునీటి ట్యాంకరు వద్ద బిందెలతో మహిళలు

ఆమదాలవలస మున్సిపాలిటీ జనాభా	49,823 మంది
రోజూ అవసరమైన తాగునీరు	5,700 కిలో లీటర్లు
సరఫరా చేస్తోన్నది	4,611 కిలో లీటర్లు
రోజుకి ఉన్న లోటు	1,089 కిలో లీటర్లు

తాగునీరందిస్తాం

"మున్సిపాలిటీ పరిధిలో కొన్ని వార్డులకు తాగునీటిని ట్రాక్టర్లతో అందిస్తున్నాం. ప్రధాన పైపులైన్లు తరచూ లీకవుతుండటంతో కొన్ని వార్డులకు నీటిని సకాలంలో అందించలేకపోతున్నాం. మున్సిపాలిటీ పరిధిలో కుళాయి నీటిని అందించేందుకు రూ.61 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టును తయారుచేసి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభించి నిరంతరాయంగా మున్సిపాలిటీలో అన్ని వార్డులకు తాగునీటిని అందిస్తాం.

–పి.బాలాజీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస"

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్తు శాఖ డీఈఈ బి.రవికుమార్ అన్నారు. సోమవారం ఆమదాలవలస గ్రామీణ విద్యుత్తు కార్యాలయంలో సూర్యఘర్ పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకోవాలని తెలిపారు. సొంత ఇల్లు ఉన్నవారు ఈ సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే కలిగే లాభాలను వివరించారు. మూడు కిలోవాట్ల ప్రాజెక్టు రూ.2.64 లక్షలు ఉండగా ప్రభుత్వ రాయితీతో రూ.78 వేలకు అందిస్తున్నామన్నారు. విద్యుత్తు శాఖ గ్రామీణ ఏఈ రవికుమార్, జేఈ రఘు, సబ్ ఇంజినీర్ మహేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ రామారావుతో పాటు సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



ఆమదాలవలస గ్రామీణ విద్యుత్తు కార్యాలయంలో మాట్లాడుతున్న డీఈఈ రవికుమార్

చెత్త కుప్పలతో ఇక్కట్లు



ఎచ్చెర్ల గ్రామ పశువైద్యశాల వీధి మధ్యలో చెత్తకుప్పలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొంత కాలంగా వీధి కాలువల్లో చెత్త సైతం తొలగించలేదని స్థానికులు వాపోతున్నారు. చెత్త వల్ల దోమలు వృద్ధి చెందడంతో పాటు దుర్వాసనతో అవస్థలు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై మండల పంచాయతీ అధికారి బి.మల్లేశ్వరరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా పంచాయతీ కార్యదర్శి నియామకం జరగలేదని, వీలైనంత త్వరగా కార్యదర్శిని నియమించి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

ట్రాఫిక్ సమస్యతో అవస్థలు..!

ఆమదాలవలస పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ప్రైవేటు బస్సులు, కూరగాయల బండ్లు తదితర వాటిని ఇష్టానుసారంగా నిలపడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ ఉన్నందున నిత్యం ప్రయాణికులు సుదూర ప్రాంతాల నుంచి ఇదే రహదారిపై ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. రోజూ ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, విద్యార్థులు, పుర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎస్సై వెంకటేష్‌ను వివరణ కోరగా ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



పేరుకుపోయిన వ్యర్థాలు



శ్రీకాకుళం నగరంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. డబ్బాల్లో వేసిన వ్యర్థాలను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పలు కాలనీలు, ప్రధాన రహదారుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జీటీ రహదారిలో ఓ బ్యాంకు వద్ద డబ్బాలో చెత్త నిండిపోయి రహదారిపై పడుతున్నా సంబంధిత విభాగం చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా నగరంలో పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ప్రతి వీధికీ సీసీ రహదారి, కాలువలు



సరుబుజ్జిలి: మర్రిపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

సరుబుజ్జిలి, కలెక్టరేట్(శ్రీకాకుళం), గార, ఎచ్చెర్ల, జి.సిగడాం, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతి వీధికి సీసీ రహదారి, కాలువల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని మర్రిపాడు, సుభద్రాపురం, పెద్ద వెంకటాపురం గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. డిసెంబరు నెలాఖరు నాటికి సీసీ రోడ్లు, కాలువలు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, నందివాడ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు. ❖ శ్రీకాకుళం నియోజకవర్గంలో రూ.32 కోట్లతో రహదారులు, కాలువల నిర్మాణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. పల్లె పండగలో భాగంగా శ్రీకాకుళం గ్రామీణ మండలం కిష్టప్పేట, భైరి, కరజాడ, సింగుపురం, గార పంచాయతీ ఆరంగిపేట, తూలుగు, వత్సవలస పంచాయతీ గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శీర రమణయ్య, ఎంపీడీవో శైలజ, సింగుపురం సర్పంచి ఆదిత్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ❖ గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని డీమత్స్యలేశంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



ఎచ్చెర్ల: డీమత్స్యలేశంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



శ్రీకాకుళం గ్రామీణ మండలం భైరిలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ సర్పంచి చిన్నారావు

తెదేపా జిల్లా నాయకుడు చౌదరి నారాయణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు బెండు మల్లేసు, తదితరులు పాల్గొన్నారు. ❖ లావేరు మండలం లోపెంట గ్రామంలోనూ, రణస్థలం మండలం మహంతిపాలెం గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, లంక శ్యామ్, తదితరులు పాల్గొన్నారు. ❖ జి.సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారులు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎన్.ఈశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిద్రలోనే కార్మికుడి మృతి



మృతి చెందిన సత్యేంద్రసింగ్

జి.సిగడాం, న్యూస్‌టుడే: మండలంలోని పాలకండ్యాం పరిధిలోని సీతారామలక్ష్మి జూట్ కర్మాగారంలో రోజువారి కూలీగా పనిచేస్తున్న సత్యేంద్రసింగ్(55) సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సత్యేంద్రసింగ్ రోజువారీ కూలీగా పనిచేస్తూ కర్మాగారం పక్కనే ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం కర్మాగారంలో పనికి వెళ్లి వచ్చిన తరువాత మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి గదిలో పడుకున్నాడు. సాయంత్రం వరకు తెలివి లేకుండా పడుకోవడంతో తోటి కూలీలు చూసి కర్మాగారం యాజమాన్యానికి చెప్పగా పాలకండ్యాంలో ఉన్న ప్రైవేటు వైద్యుడిని పిలిపించి పరీక్ష చేయించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వద్ద గ్యాస్టిక్, సుగర్ మాత్రలు ఉన్నాయని, శరీరంపై ఎటువంటి గాట్లు లేవని పోలీసులు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని చెప్పారు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. ఏఎస్సై రామకృష్ణ ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవా సమితి యూత్ సమన్వయకర్తగా గోవిందస్వామి



గోవిందస్వామిని అభినందిస్తున్న జనార్దనరావు, సూర్యారావు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అక్కులపేట-వేణమ్మపేట సత్యసాయి సేవా సమితి యూత్ సమన్వయకర్త(కోఆర్డినేటర్)గా చిడిపోతు గోవిందస్వామి ఎన్నికయ్యారు. సోమవారం సమితిలో సమావేశాన్ని నిర్వహించి యూత్ సమన్వయకర్తను ఎన్నుకున్నట్లు సత్యసాయి సేవా సమితుల జోనల్ కోఆర్డినేటర్ ఎం.జనార్దనరావు, సమితి కన్వీనర్ సూర్యారావు తెలిపారు. గోవిందస్వామి ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించడంతో ఆయనను యూత్ కోఆర్డినేటర్‌గా ఎన్నుకున్నట్లు సత్యసాయి జిల్లా సేవా సమితుల యూత్ కోఆర్డినేటర్ బి.సాయికృష్ణ తెలిపారు.

రహదారులు ఇలా.. ప్రయాణించేదెలా..!



అధ్వానంగా ఆమదాలవలస మండలం చెవ్వాకులపేటకు వెళ్లే రోడ్డు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలంలోని గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. గత అయిదేళ్లలో కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో కొన్ని గ్రామాలకు వెళ్లే మార్గాలపై నడకా కష్టంగా మారింది. కొన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణానికి తెదేపా ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టగా 25 శాతం వరకు జరగగా ఎన్నికల అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిని రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచి పనులు చేపట్టినా ఒక్క రహదారి కూడా నిర్మించకుండా వదిలేశారని ప్రజలు వాపోతున్నారు. వర్షాలు కురిస్తే దారులు బురదమయంగా మారడంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే గోతుల్లో నీరు చేరడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దెబ్బతిన్న మార్గాలివే

ఆమదాలవలస మండలం రామచంద్రాపురం, ఆనందపురం, చెవ్వాకులపేట, బొబ్బిలిపేట, ఈసర్లపేట, దిబ్బలపేట, నారిపేట, ఇస్కలపేట, వంజంగి, వంజంగిపేట, అక్కులపేట, దివంజిపేట, నెల్లిమెట్ట, సైలాడ, చిట్టివలస, కుమ్మరిపేట, దన్నానపేట, నెల్లిపర్తి గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి.

నిధులు అందగానే నిర్మిస్తాం

ఆమదాలవలస మండలంలోని గ్రామాలకు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అవి అందిన వెంటనే నిర్మాణం చేపడతాం.

–అంజనేయ నాయక్, ఏఈ, ఆర్ అండ్‌బీ ఆమదాలవలస